క్లుప్తంగా

వెదురు వేలంలో ఆదాయం



వేలం నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ

రుద్రవరం: స్థానిక కలప డిపోలో నంద్యాల డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ బుధవారం వెదుర్ల వేలం నిర్వహించారు. డీఎఫ్‌ఓ మాట్లాడుతూ.. మొదటి, రెండవ, మూడవ తరగతులకు చెందిన 34,500 వెదుర్లకు వేలం నిర్వహించగా రూ.8.10 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. వేలంలో రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజా, ఎఫ్‌ఎస్‌ఓలు నాగరాజు, రాణెమ్మ, పెద్దన్న, కాంట్రాక్టర్ కొల్లం పుల్లయ్య తదితరులు ఉన్నారు.

రీసర్వే త్వరగా పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా పట్టణంలో చేపట్టిన రీ సర్వే పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో రీ సర్వే పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు



బాలింత వివరాలు తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

నంద్యాలటౌన్: ప్రజలకు అందించే వైద్య సేవలు, ప్రజారోగ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఎంఅండ్ హెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం ఆయన మహానంది మండలం తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ తిరిగి గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో కలిసి యోగా చేసి యోగాపై ప్రజలకు అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన ఎంఈఓ–2

దొర్నిపాడు: ఎంఈఓ –2గా రామచంద్ర య్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆవు కు మండలం రామాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వ హిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈయ నకు పాఠశాల అకడమిక్ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఎంఈఓ అబ్దుల్ కరీం తెలిపారు.

రూ.7.41 కోట్లతో సచివాలయ భవనాల నిర్మాణం



భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఈ రామ్మోహన్

చాగలమర్రి: మండలంలో ప్రభుత్వం రూ.7.41కోట్ల వ్యయంతో 17 సచివాలయాల నిర్మాణాలను చేపట్టిందని వాటిలో 7 సచివాలయ భవన నిర్మాణాలు పూర్తయ్యాయని వాటిని సంబంధిత అధికారులకు అప్పగించామని పంచాయతీ రాజ్ ఈఈ, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ రామ్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో నిర్మిస్తున్న సచివాలయ–3 భవనాన్ని పరిశీలించారు. ఏఈ కొండారెడ్డి, కాంట్రాక్టర్ హుసేన్‌వలితో పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఈ లక్ష్మీనరసింహ ఉన్నారు.

విద్యార్థినులకు లోటు రానివ్వొద్దు

రుద్రవరం: విద్యార్థినులకు వసతుల్లో ఎలాంటి లోటు రానివ్వద్దని జీసీడీఓ సువర్చల సూచించారు. స్థానిక కేజీబీవీని బుధవారం తనిఖీ చేశారు. వసతుల కల్పన, అల్పాహారం, భోజనం వంటి విషయాలపై విద్యార్థినులను అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. బాలికలను బాగా చదివించి మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని చెప్పారు. ఎస్‌ఓ లక్ష్మీదేవి ఉన్నారు.

మందుబాబుల ఆగడాలను అరికట్టాలి

దొర్నిపాడు:మందుబాబులు ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించి సీసాలను ఇష్టం వచ్చినట్లు పడేస్తున్నారని చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ శకుంతల కోరారు. ఆమె బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మద్యం సీసాలను వీడియో తీసి ఎస్‌ఐ తిరుపాల్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఎంఈఓ అబ్దుల్ కరీం, తహసీల్దార్ జయప్రసాద్‌కు పంపించారు. పాఠశాలలో 700 మందికిపైగా విద్యార్థులు అభ్యసిస్తున్నారని ఆవరణలో మద్యం సీసాలు పడేయడమేంటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

శిరివెళ్ల: వర్షాకాలం అరంభమవుతుందని గ్రామాల్లో పారిశుద్ధ్యం ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ మంజులావాణి సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష, పారిశుద్ధ్యం, తాగునీరు, స్పందనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈజీగా ఈ–కేవైసీ

- అందుబాటులోకి కిసాన్ సేవా యాప్
- ఎక్కడి నుంచైనా నేరుగా రైతన్నలే కేవైసీ చేసే అవకాశం
- నంద్యాల సబ్‌డివిజన్ పరిధిలో 85 శాతం లక్ష్యం పూర్తి
- నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశాలు



బి.కోడూరులో ముఖ ఆధారిత నమోదుతో ఈ–కేవైసీ చేస్తున్న వ్యవసాయ సహాయకుడు



గడివేములలో యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ హేమసుందరరెడ్డి

నంద్యాల (సెంట్రల్): రైతుభరోసా, పంటల బీమా, మద్దతు ధరకు పంట కొనుగోలుతో చిన్న, సన్నకారు రైతులకు ఒనగూరుతున్న ప్రయోజనం అంతా ఇంతా కాదు. కానీ.. వీటివల్ల అందే సొమ్ము బ్యాంక్ ఖాతాకు జమ కావాలంటే ఈ–కేవైసీ చేయించుకోవటం తప్పనిసరి. ఈ–పంట నమోదు చేసుకున్నా, ఈ–కేవైసీ పూర్తికాక ఏటా సుమారు 15–20 శాతం మంది రైతులు ఆర్థిక లబ్ధి పొందలేకపోతున్నారు. అవగాహన లేమి, కర్షకులు సమయానికి అందుబాటులో లేకపోవటమే ఇందుకు కారణమని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో నమోదు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం.. కిసాన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇకపై రైతులు ఈ–కేవైసీని స్మార్ట్ ఫోన్ సాయంతో తమ ఇంటి వద్దే పూర్తి చేసుకునే సదుపాయం కల్పించింది.

వందశాతం ఈ–కేవైసీ నమోదుకు ఆస్కారం..

నంద్యాల సబ్‌డివిజన్‌లోని 6 మండలాల పరిధిలో 41,737 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాలి. ఇప్పటి వరకూ 36,078 మంది అన్నదాతలు ఈ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ఇంకా 5,659 మంది కర్షకులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. వీరందరికీ పీఎం కిసాన్ యాప్ ద్వారా ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వంద శాతం ఈ–కేవైసీ పూర్తి చేసేందుకు కిసాన్ యాప్ ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు గడువు ఉండడం, నమోదు సులభతరం కావటంతో ఈసారి రైతులందరితో ఈ–కేవైసీ పూర్తి చేయించి, వీలైనంత ఎక్కువ మంది ప్రభుత్వ సాయం పొందేలా అధికారులు కృషి చేస్తున్నారు. వారం రోజులుగా నమోదు తక్కువగా ఉన్న గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపడుతూ కిసాన్ యాప్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు.

సంక్లిష్టతలకు చెక్..

ప్రారంభంలో గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉన్న రైతుల వేలి ముద్రలు తీసుకుని ప్రక్రియ పూర్తి చేసేవారు. మిగిలిన వారిని ఫోన్ ద్వారా సంప్రదించి, వారికి వచ్చిన ఓటీపీతో నమోదు చేసేవారు. కొందరు అన్నదాతలు ఓటీపీ చెప్పేందుకు నిరాకరించటం, భూ యజమానులు మరణించటం, భూమి పూర్తి వివరాలు ఆన్‌లైన్ కాకపోవటం , మ్యుటేషన్ చేయించకపోవటం వంటి కారణాలతో ఈ–కేవైసీ పూర్తి కాకపోయేది. నమోదు చేయించుకోని రైతులకు ఈసారి పీఎం కిసాన్ మొత్తం జమ కాదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సాగుదారులు స్పందించి వీలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

స్మార్ట్‌ఫోన్ ద్వారా ఇలా...

నంద్యాల సబ్‌డివిజన్‌లో మండలాల వారీగా ఈ–కేవైసీ వివరాలు ఇలా...			
మండలం	రైతులు	ఈ–కేవైసీ పూర్తి	పెండింగ్ రైతులు
నంద్యాల	5,734	4,430	1,304
మహానంది	5,456	4,831	625
బండిఆత్మకూరు	9,847	8,643	1,204
పాణ్యం	5,821	5,450	371
గడివేముల	5,545	5,193	352
బనగానపల్లె	9,334	7,531	1,803

ఈక్రాప్, ఈ–కేవైసీ ముఖ ఆధారిత విధానంలో నమోదు ప్రక్రియ ఎవరికి వారే పూర్తి చేసుకోవచ్చు. ముందుగా స్మార్ట్‌ఫోన్ లోని ప్లే స్టోర్‌లోకి వెళ్లి పీఎం కిసాన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. కిసాన్ యాప్‌లో ఆధార్ సంఖ్య నమోదు చేయగానే దరఖాస్తులో నమోదు చేసిన సెల్‌ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దీనికి ఆధార్ లింక్‌తో సంబంధం ఉండదు. ఓటీపీ నమోదు చేయగానే ఉద్యోగులు ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నట్టుగా కనిపిస్తుంది. ఫోన్‌లో ముందు కెమెరా ఎదుట కళ్లు కదిలిస్తే యాప్‌లో ఓకే అని వస్తుంది. దీంతో ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తయినట్టుగా పూర్తి వివరాలు వస్తాయి.

ఈ–కేవైసీ నమోదులో నిర్లక్ష్యం వద్దు



ప్రభుత్వం అన్నదాతలకు అందించే ప్రతి పథకానికి ఈ–కేవైసీ నమోదు తప్పనిసరి. ఈ విషయంలో అలసత్వానికి తావివ్వకుండా రైతులందరూ విధిగా ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి. కొత్తగా వచ్చిన కిసాన్ యాప్‌తో నమోదులో ఎదురవుతున్న సమస్యలకు చాలా వరకు పరిష్కారం దొరికి ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. సబ్‌డివిజన్ పరిధిలోని 104 రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి దీనిపై నిర్దేశిత లక్ష్యాల్ని చేరుకోవటంలో స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ముఖ ఆధారిత గుర్తింపుతో భారీగా నమోదు చేయించాం. ఇంకా 15 శాతం మంది రైతులు నమోదు చేయించుకోలేదు. వీరంతా తక్షణం ముందుకు వచ్చి నమోదు చేసుకోవాలి. కిసాన్ యాప్‌తో ఈసారి వంద శాతం లక్ష్యం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. కొన్నిచోట్ల వ్యవసాయదారులు కానివారు, భూమిలేని వారు సైతం నమోదు చేసుకుని యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. దీనివల్ల మా శాఖ లక్ష్యాల్లో తేడాలు వచ్చి సమయం వృథా అవుతోంది.

– రాజశేఖర్, సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల సబ్‌డివిజన్

తీరిన నీటి సమస్య



పనులను పరిశీలిస్తున్న డీఈ మురళీధర్‌రావు

రుద్రవరం: మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి, పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి చొరవతో చిలులూరు గ్రామస్తులకు నీటి సమస్య తీరింది. మండలంలోని చిలులూరు గ్రామం వక్కిలేరు వాగు పక్కనే ఉన్నప్పటికీ నీటి వసతిల లేకపోవడంతో వాగులో చెలిమలు తవ్వుకొని వాటి నీటితో దాహం తీర్చుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యను గుర్తించిన వారు ఎంపీ నిధుల నుంచి రూ.28.50లక్షలు మంజూరు చేయించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చందలూరు గ్రామ సమీపంలో వాగు వద్ద కొత్త బోరు వేయించి, బోరు మోటారు అమర్చి అక్కడి నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని సరఫరా చేయించే పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్‌రావు, ఏఈ ప్రమోద్, గ్రామ సర్పంచు ప్రసాదరెడ్డి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యాకానుక పంపిణీ

శిరివెళ్ల: మండలంలో జగనన్న విద్యా కానుకల పంపిణీ కొనసాగుతోంది. బుధవారం మహదేవపురం సర్పంచు పెద్ది రమణయ్య, కామినేనిపల్లె సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి ఆయా గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ–2 వీరప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించాలన్నారు.

అక్రమ సంపాదనకే మదరసాలో స్కూల్ ఏర్పాటు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మలసత్రం: చౌక్ మసీదు స్థలంలో మదరసాను ఏర్పాటు చేసి అక్రమంగా డబ్బు సంపాదించేందుకు ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను టీడీపీ రాష్ట్ర మైనారిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్ నెలకొల్పడం దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్ బాషా పేర్కొన్నారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి నివాసంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఖాదర్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ భూమి అంటే అల్లాకు చెందినదని, దాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా సంపాదించడం బాధాకరమన్నారు. ముస్తాక్ అహ్మద్ మదరసా నెలకొల్పి 8 ఏళ్లు బాడుగ కట్టలేదని, చంద్రబాబు నాయుడు సమక్షంలో ముస్లింలపై దాడి చేయిస్తే నాడు నోరు మెదపలేక పోయారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ముస్లింల కోసం 5 ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ, 13 మంది కార్పొరేషన్ చైర్మన్లను నియమించిందని చెప్పారు. టీడీపీ హయాంలో పదవులు ఇవ్వకపోగా దాడులు చేశారని గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మాట్లాడుతూ..చౌక్ మసీదు ఘటనలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేసేందుకు వచ్చిన జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారిపై మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఒత్తిడి తీసుకొచ్చారన్నారు. చౌక్ మసీద్ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన ఆస్తి అని, సంబంధిత ముతవలిల ఆధీనంలో ఉంటుందన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు. అనంతరం హర్ దిల్‌మే వైఎస్సార్, హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా కరపత్రాలు విడుదల చేశారు. జిల్లా అధ్యక్షుడు యూనుస్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ షేక్‌మాబున్నీసా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రోగుల సంఖ్య పెరగాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఇన్ పేషెంట్స్ సంఖ్య పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్న హై రిస్క్ గర్భిణులను గుర్తించి మెరుగైన వైద్య సేవలందించాలని చెప్పారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్లు క్షేత్రస్థాయి పర్యటించి గర్భిణులకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణను ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య గుర్తింపు కార్డుల జనరేషన్‌ను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. వెలుగోడు, ఆత్మకూరు పట్టణాలలో కొత్తగా నిర్మించిన ఆసుపత్రులలో విద్యుద్దీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డీసీహెచ్ఎస్ జఫ్రుల్లాకు సూచించారు.

వాసవీమాతకు సారె సమర్పణ



చీర, సారె తీసుకెళ్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో అమ్మవారిశాలలో వెలసిన వాసవీమాతకు ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి చీర, సారె భక్తి శ్రద్ధలతో సమర్పించారు. ఉదయాన్నే అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించారు. సారె సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఒడి బియ్యం కార్యక్రమాన్ని జరిపించి మంగళ హారతులు ఇచ్చారు. సభ్యులు ఇందుమతి, శోభ, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి: ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా చట్ట ప్రకారం చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి రంగనేతాజి స్పష్టం చేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రం–2లో విత్తనాల, ఎరువుల, క్రిమిసంహారక మందుల డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాల, ఏరువుల, క్రిమిసంహారక మందులకు తప్పకుండా బిల్లులు ఇవ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేకుండా విక్రయాలు చేపడితే కేసులు తప్పవని హెచ్చరించారు.

ఎంఈఓకు అభినందనలు



ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డిని సన్మానించిన ఉపాధ్యాయులు

ఉయ్యాలవాడ : మండలంలో నూతనంగా నియామకమైన ఎంఈఓ 2 వీరప్రతాప్‌రెడ్డిని బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పీఆర్‌టీయు నాయకులు నాగేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి, సీపీఎస్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాటసాని శివారెడ్డి ఎంఈఓను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచాలి

నంద్యాల(రూరల్): గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు వచ్చే రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. బుధవారం మండలంలోని పులిమద్ది రైతుభరోసా కేంద్రాన్ని ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నంద్యాల(సిటీ): పట్టణంలోని ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. బుధవారం 28వ వార్డు విజయపురి కాలనీ, బర్మశాల, శ్యాంనగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్థలాల యజమానులకు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వార్డులో జరుగుతున్న శానిటేషన్, డ్రైనేజీ పూడిక తొలగించే పనులను పరిశీలించారు. అలీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు.

క్విజ్ పోటీలతో మేథస్సు మెరుగు

నంద్యాల(వ్యవసాయం): జీ–20 ఈవెంట్ క్విజ్ పోటీలతో విద్యార్థుల్లో మేథస్సు మెరుగవుతుందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8 నుంచి 10వ తరగతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మండల స్థాయిలో ఆలిండియా ఆర్‌బీఐ స్కూల్ క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈ నెల 28న జిల్లా స్థాయి క్విజ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ భాస్కరనాయుడు

ఆళ్లగడ్డ: ఇళ్ల నిర్మాణాలు గడువులోపు పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ భాస్కరనాయుడు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 10,699 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని వాటికి కోసం రూ.21.42 కోట్లు ఖర్చు చేశామన్నారు. జూలై 31లోగా జిల్లాలో 18,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా 14,300 పూర్తయ్యాయని కేవలం 4,200 గృహాలను మాత్రమే పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శిరివెళ్ల: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు హౌసింగ్ పీడీ భాస్కరనాయుడు తెలిపారు. బుధవారం యర్రగుంట్ల జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆరా తీశారు. కాలనీలో 75 ఇళ్లు మంజూరు కాగా 20 నిర్మాణాలు పూర్తయ్యాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం వివరించారు. డీఈ నాగరాజు, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఏఈఈ నాగేశ్వర్, ఈఓఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : జగనన్న లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు హౌసింగ్ ఏఈ నరసింహరావు ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

చాగలమర్రి: స్థానిక జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు జులై 15 నాటికి పూర్తి చేయాలని ఎంపీడీఓ మహబూబ్ దౌలా హౌసింగ్ ఇంజినీరింగు అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సమావేశం నిర్వహించారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

గోస్పాడు: నాడు–నేడు ఫేజ్ –2 పనులను సకాలంలో పూర్తి చేయాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాల జోజప్ప కోరారు. గోస్పాడు, జూలేపల్లె గ్రామాల్లో జరుగుతున్న పనులు బుధవారం పరిశీలించారు.

చిన్నబాబు కుటుంబాన్ని ఆదుకోవాలి

నంద్యాల(రూరల్): ఆత్మహత్యకు పాల్పడిన చిన్నబాబు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని దళిత సంఘ జేఏసీ నాయకులు మేకల లింగస్వామి, బాబురావు, లాయర్ వెంకటేశ్వర్లు, సుబ్బయ్యలు కోరారు. బుధవారం స్థానిక నిశాంతి భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

రుద్రవరం: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్టు ధనలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం) సైంటిస్టులతో బుధవారం చిరుధాన్యాలసాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధిహామీ పథకం సిబ్బంది, వీఏఏలు తదితరుల నుద్దేశించి ఆమె మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారిత ఎరువుల వినియోగం వల్ల ఖర్చు బాగా తగ్గించుకోవచ్చన్నారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ ఖర్చుతో చిరుధాన్యాల సాగు చేసేలా రైతులను చైతన్య పరచాలని చెప్పారు. వరి,కంది,మినుము తదితర నాణ్యమైన విత్తనాలు కేవీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. శాస్త్రవేత్తలు సుధాకర్,రవిగౌడ్,లక్ష్మీప్రియ,,ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఏఈ రాజు ఉన్నారు.

ఏఆర్టీ సెంటర్ల తనిఖీ



వైద్యుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ రమేష్ రెడ్డి

నంద్యాలటౌన్: నంద్యాల జిల్లాలోని సర్వజన ఆసుపత్రి, శాంతి రాం ఆసుపత్రుల్లోని ఏఆర్టీ సెంటర్లను సీడీసీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా హెచ్ఐవీ బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, వారికి అందిస్తున్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్త పరీక్షలకు కావలసిన పరికరాలు, వాటి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, టీబీ పేషెంట్లు, చిన్న పిల్లలకు కావలసిన అన్ని రకాల సదుపాయాలు అందించాలని, అవసరమైతే నోడల ఆఫీసర్ సహకారంతో రక్త పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రిపోర్టులు తనిఖీ చేసి మందులు తీసుకోని వారికి సమాచారం అందించి మందులు అందేలా చూడాలని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం మేనేజర్ అలీ హైదర్, షేర్ ఇండియా ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాజకుమార్ పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు




పోలీసు స్టేషన్‌లో బాలుడి తల్లి, షాపు యజమానికి కౌన్సెలింగ్ ఇస్తున్న మురళీకృష్ణ

చాగలమర్రి: బడి ఈడు పిల్లలు బడిలో ఉండకుండా, కూలీ పనులకు పంపితే చట్టారీత్యా నేరమని జిలా సహాయ కార్మిక శాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం కార్మికశాఖ, ఐసీడీఎస్, పోలీసుశాఖ సంయుక్తంగా మండల కేంద్రంలో బాల కార్మికులను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ముత్యాలపాడు బస్టాండు, పెద్ద మకానం, మెయిన్ బజార్, పాత జాతీయ రహదారిపైనున్న పలు మెకానిక్ షెడ్లు, కుటీర పరిశ్రమలు, వాణిజ్య సముదాయాల్లో తనిఖీలు చేపట్టారు. ముత్యాలపాడు బస్టాండు వద్ద జుబేర్ మెకానిక్ షెడ్డులో షేక్షావలి అనే 12 సంవత్సరాల బాలుడు పని చేస్తుండగా గుర్తించి బాలుడి తల్లితో పాటు, షెడ్డు యజమానిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మొదటి తప్పుగా భావించి యజమానికి రూ.1,500 జరిమానా విధించారు. సహాయ కార్మిక శాఖ అధికారులు సమీర్, విద్యావతమ్మ ఉన్నారు.

తోటల పెంపకానికి ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : పండ్ల తోటల పెంపకం కోసం ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలకు అవగాహన కల్పించారు. 5 ఎకరాల్లోపు వున్న సన్న, చిన్నకారు రైతులు పండ్ల తోటలు సాగు చేస్తే ప్రభుత్వం ఎకరాకు రూ. 90 వేల నుంచి రూ. 1.10 లక్షల వరకు మూడు సంవత్సరాల పాటు సాగు నిర్వహణ నిమిత్తం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. మండలానికి 75 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేసుకునేందుకు అనుమతివ్వగా 20 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. ఏపీఎం గురుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక మున్సిపల్ టౌన్ పార్కులో ఆయుష్‌యోగా సేవా సమితి ప్రముఖ యోగా గురువు ఖండే ఆనంద్ గురూజీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామునే సూర్య నమస్కారాలు, యోగాసనాలు, నిర్వహించిన అనంతరం హోమాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలోబ్రహ్మకుమారి సావిత్రమ్మ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

నంద్యాల(న్యూటౌన్):పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ అర్చన మాట్లాడారు. నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గంగన్న, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ అధ్యక్షతన యోగా దినోత్సవాన్ని జరిపారు.

ఖాదరాబాద్ నర్సింగ రావు స్కూల్‌లో

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా జరిగింది.

ఆళ్లగడ్డ : రోజూ క్రమం తప్పకుండా యోగా చేయడంతో మానసిక ఒత్తిడి, ఆందోళనలు తొలగిపోతాయని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ శేషన్న అన్నారు. అహోబిలం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ ఇచ్చారు.

జగనన్న సురక్షపై అవగాహన

చాగలమర్రి: డి.కొత్తపల్లె పంచాయతీ మజరా గ్రామమైన డి.వనిపెంట గ్రామ సచివాలయ కార్యాలయంలో బుధవారం ఎండీపీఓ మహబూబ్ దౌలా ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ నెల 24వ తేదీ నుంచి వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ధ్రువ పత్రాల అవసరాలను గుర్తించి మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.